






# విలువ పెరిగింది!


పాలకోడేటి సత్యనారాయణరావు


**మ్యూజియంలో** చూడాల్సిన వన్నీ చూశాను.

బయటకు వద్దామన్నా ఇంకా తనివి తీరినట్లు లేదు. అన్ని వస్తువుల్నీ చూసినా ఇంకా ఏదో తపనా, ఆర్తీ నన్ను వదలటం లేదు. అక్కడ ఉండే వస్తువులు చెప్పే కథలు వినాలనీ, వాటి జీవితంలోకి తొంగి చూడాలనీ, ఆ విషాద గాథలు విని కొంత బాధను పంచుకోవాలనీ... ఏవేవో కోరికలు!

విషాద గాథలేనని ఎలా చెప్పటం? అవును, అక్కడ వస్తువు లన్నీ విషాద గాథలనే వినిపిస్తాయి. ఈ నాడు ఇక మిగిలిందేముంది. వాటికి విషాదం తప్ప! గతంలో ఎంత గొప్ప జీవితం గడిపి ఉన్నా, ఇప్పుడు ఇలా వీధిన పడాల్సి వచ్చింది.

రాజుగారి నడుమున హుందాగా ఉండి,

ఎప్పుడూ నిజానికి ఒక్క రక్తపు బొట్టునైనా చిందించి ఉండకపోయినా ఆయన కత్తి వెలగబెట్టిన ఆ ఠీవి ఇప్పు డెక్కడికి పోయింది? ఇప్పుడు నవరత్న ఖచిత ఖడ్గం అద్దాల బీరువాలో అందంగా తుప్పు పట్టేందుకు సిద్ధంగా ఉంది.

రాణిగారి నుదుటను అలంకరించి, ఆమెతో సహా పరివారం అందర్నీ చిన్న చూపు చూస్తూ ఉండిన ఆమె పాపిట బిళ్ళలో ఆ దర్పం ఏమయిం దీనాడు? ఏ కేశాల క్లేశాల నడుమ చిక్కుకొని ఉండి పోయింది? ఇప్పు డా పాపిట బిళ్ళలో ముత్యాలు చెల్లా చెదరై పోయి దర్పం తగ్గిన ముసలి రాణిలా ఒక మూల పడి ఉంది.

నవాబుల ఇళ్ళలో అడుగడుగునా వెలిగిన దర్పాలు, డాబులు ఈ రోజున ఇక్కడ నేలమీద పడి దీనంగా చూస్తున్నాయి. ఒకప్పుడు తలెత్తి బతికిన జీవితాలు ఈ రోజున చిరుగుల ముక్కలై జీరాడుతున్నాయి.

ఇంతకన్నా విషాదం ఏముంది? ఇంతకు మించి విషాద గాథలు ఇంకేమున్నాయి?

మనసంతా బాధతో నిండిపోయింది. పరదాల వెనక ఖుషీగా బతికిన బతుకులన్నీ ఇలా వీధిన పడటం బాధగా ఉంది. అయినా ఇలా జరగకపోయి ఉంటే, పరదాల వెనక ఏం జరిగేదో మామూలు జనానికి ఎలా తెలిసేది?

కాలం చాలా తమాషాగా ప్రవర్తిస్తుంది. ఒకరి పట్ల కఠినంగా ప్రవర్తిస్తున్నట్లుండే కాలం ఇంకొకరి పట్ల అదే సమయంలో దయా దాక్షిణ్యా లను ప్రసరిస్తుంది. కాలమనేది ఒక నాణెం. ఒక వైపు బొమ్మ అయితే రెండో వైపు బొరుసు. బొమ్మ వా రైతే, బొరుసు మీది. ఈ రోజు కథ ఇదైతే, రేపటి కథ వేరు.

మ్యూజియంలోంచి బయటి కొచ్చాను.


కళ పట్ల, జాతి ఔన్నత్యం పట్ల ఉండే అభిమానం అలాంటిది కాబోలు. నాకు ఇంకా ఆ వస్తువుల్ని చూడాలనీ, వాటి పాత బతుకుల్ని తడిమి చూడాలనీ ఉన్న కాంక్ష తగ్గలేదు.

మెల్లిగా నడుచుకుంటూ కదిలాను.

వంతెన మీద నడుస్తూంటే కింద మురికి నీళ్ళతో నిండిన మూసీ మెల్లిగా ప్రవహిస్తూంది. నాకు ఈ క్షణంలో ఏం జరిగిందో తెలీటం లేదు. దేన్ని చూసినా అందులోంచి గతం నన్ను ఆప్యాయంగా తట్టి పలకరిస్తున్న అనుభూతి కలుగుతూంది. ఈ మూసీ మాత్రం ఎన్నెన్ని కథలకు తావిచ్చింది? భాగ్యనగరం పుట్టుకకు ఈ నది కాదూ కారణం?

నడుస్తూ ఉంటే నాకు బజార్లో ఒక చోట పాత వస్తువుల దుకాణం కనపడింది. పాత వస్తువు లంటే పనికిరానివి అని కాదు. ఈ వస్తువులకు గతమెంతో ఘనత కెక్కిన చరిత్ర ఉంది. తట్టి పలకరిస్తే పులకరించే కథలు చెప్పే వస్తువుల దుకాణం ఇది.

లోపలికి వెళ్ళాను. ఎన్నెన్నో తివాచీలు. ఎన్నెన్నో షాండిలీర్లు. ఎన్నెన్నో విగ్రహాల బొమ్మలు. లతలతో కొన్ని ఉంటే, తలలు ఊడి కొన్ని ఉన్నాయి. ఆప్యాయంగా వాటిని పలకరిస్తూ, చేతితో తాకి సానుభూతి చెబుతూ వాటి మధ్య కొంచెం సేపు గడిపాను. ఆ తరవాత బయటి కొచ్చేశాను.




అప్పటికే నా కోసం వేచి చూస్తున్నట్లుగా ఒకరు అక్కడ నిలబడి ఉన్నాడు. నడుస్తూంటే నా వెనకగా నడిచి, రెండడుగులు త్వరగా వేసి నన్ను కలుసుకునే ప్రయత్నం చేస్తూంటే నేను ఆగాను.

"నమస్తే!" అన్నా డతను. ఇప్పుడు పరిశీలనగా చూశా నతన్ని. అతను నాకు ఇంత క్రితం పరిచయం ఉన్న వ్యక్తి కాడు. అరవై పైనే వయసున్న అతను నాకు అపరిచితుడే!

"చెప్పండి" అన్నాను.

"మీ రేమీ అనుకోనంటే..." ఆగి అన్నాడు. "సార్, మా పరిస్థితులు ఎలా చెప్పినా మీకు అర్థమయ్యేవి కావు."

అతను ఇంకా పూర్తి చేయకుండానే అర్థం అయింది నాకు అతని కథ. లేదతనం. తట్టుకోలేని బాధలు. తీర్చలేని అప్పులు. ఓర్చుకోలేని ఆకలి. ఇలాగే— ఇవి కాకపోతే ఇంకేమైనా— మొత్తానికి ఒకటే కథ.

జేబులోంచి పర్సు తీశాను. ఒక రూపాయి నోటు తీస్తూంటే, చేత్తో మెల్లిగా వద్దంటూ అన్నాడు— "నేను బిచ్చగాడిని కాను, సార్."

నేను ఇది ఊహించ లేదు. ఆ షాక్ తట్టుకుంటూ అన్నాను— "చెప్పండి, మీ కేం కావాలో!"

"మేం ఒకప్పుడు బాగా బతికిన వాళ్ళం, సార్! ఈ రోజున ఇలా ఉన్నా కానీ..." బాధ ఓర్చుకుంటు న్నాడు కాబోలు. క్షణం ఆగి తరవాత చెప్ప నారంభించాడు. "ఇంట్లో పరిస్థితి ఏమీ బాగుండ లేదు, సార్. ఇంట్లో ముగ్గురు పిల్లల ఏడుపు. ఏ మాటా అనలేక నా భార్య గోల. ఆఖరికి—ఇదిగో, ఇదొక్కటే మార్గం మిగిలింది. తప్పని సరైంది. కానీ లేకపోతే ఈ పనీ చేసే వాళ్ళం కాము!"

నేనేమీ అనలేదు. అత నవేది వింటూ ఉండి పోయాను.


"మా ఇంట్లో నవాబుల కాలం నాటివి పాతవి ఇంకా ఎన్నో వస్తువులు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటైనా మీరు తీసుకుని కొంత డబ్బు ఇప్పిస్తే..."

నవ్వాను నేను— "అలాటివి నాకు అక్కర్లేదు!"

"అలా అనకండి, సార్! మీ రొక్కసారి వాటిని చూశారంటే వదిలి పెట్టరు. పోనీ, కొనక్కర్లేదు. చూసి వెళ్ళండి, చాలు. బుద్ధి పుడితే ఆలోచిద్దురు గాని."

పోనీ అనిపించింది నాకు. ఇన్ని వస్తువుల్ని చూశాను. ఇంకొన్ని వస్తువుల్ని చూస్తే మాత్రం ఏం నష్టం అంతేకదా అనుకుని సరే నన్నాను.

అతనితోబాటుగా నడుస్తూంటే అత నేవో సంగతులు చెబుతూ ఉన్నాడు. అతను చెబుతున్న గత చరిత్రకూడా నన్ను ఆకట్టుకుంటూనే ఉంది. అతను నిజాం దగ్గర పని చేసేవాడట. నిజాం ఆఖరి రోజు వరకు ఆయన పక్కనే ఉండేవాడట. 'ఎంత గొప్ప బతుకు బతికాడండి ఆయన!' అన్నాడు. 'నిజాంకు కాకపోతే ఇంకెవరికి వస్తుందండీ ఆ బతుకు!' అనీ అన్నాడు. ఇదంతా నాకు తెలిసిందే. కానీ నాకు ఇంత కాలం తెలీని సంగతులూ ఎన్నో చెప్పాడు. నిజాం దగ్గర ఉండే పిసినారి గుణం గురించీ చెప్పాడు. ఎవరైనా సరే, నిజంకు నజరానాలు చెల్లించాల్సిందే తప్ప ఆయన ఎవరికీ ఏమీ ఇచ్చేవాడు కాడట! నిజాంకు వచ్చే నజరానాలు రకరకాలు! కొన్ని వస్తుపరంగా, కొన్ని ధన రూపంలో ఉండేవి. వస్తుపరంగా వచ్చేవి దాచే బాధ్యతలో ఇతనికీ వాటా ఉందట. కొన్ని నిజాంగారి ఖజానాకు వెళ్ళేవి. కొన్ని ఏకంగా మెల్లిగా ఇతని ఇంటికే వచ్చేసేవిట! ఒకసారి ఎవరో జపాన్ నుంచి వచ్చి బుద్ధవిగ్రహం ఇచ్చారట! 'ఎంత అందంగా ఉందండీ అది!' అన్నాడు. మరోసారి ఏదో వస్తువు వస్తే ఇతను దాన్ని తీసుకెళ్ళి పోవాలని ప్రయత్నించాడట కానీ వీల్లేకపోయిందిట!




అతని ఇల్లు వచ్చేసింది. గోనె పట్టాల వెనకనే ఇంకా జీవితం గడుపుతున్నాడులా ఉంది. చూస్తూంటేనే తెలుస్తూంది— అతనితో బాటుగా ఆ ఇంట్లో ఓదరికమూ కాపరం చేస్తూందని!

"రండి!" అన్నాడు.

లోపలికి వెళ్ళాను. కళ్ళు తిరిగి పోయాయి నాకు. ఇది ఇల్లా, కాకపోతే మరో మ్యూజియమా? ఇలాటి వాటికే 'వస్తు సంగ్రహాలయం' అని పేరు? ఎన్నెన్ని వస్తువులు!

"చెప్పండి. వీటిలో ఏ ఒక్కటైనా సరే తీసుకుని కొంత డబ్బు ఇచ్చారంటే..."

అన్నీ పరిశీలనగా మళ్ళీ చూశాను. నిజానికి ఇలాటి వస్తువులను మనలాటి సామాన్యులు జాగ్రత్త చేసుకునేంత స్తోమత, అర్హత కూడా ఉండవనుకోను. కానీ ఇంతటి వూరికి వచ్చి ఏదో ఒకటి గుర్తుగా కొనుక్కుని పోవాలనే ఆలోచనలో ఉన్నాను. పోనీ, ఇతనే అంటున్నట్లుగా ఇందులోనే ఏదో ఒకటి కొంటే... పరిశీలించి చూస్తూంటే, నన్ను బుద్ధ విగ్రహం ఒకటి బాగా ఆకర్షించింది.

అటుకేసి కదిలాను.

"అదేనండి నేను చెప్పింది! జపాన్ నుంచి వచ్చిన వా ళ్ళిచ్చింది ఇదే!"

పరిశీలించి చూశాను. ఎంత అందంగా ఉందని!

వెంటనే కొనుక్కోవాలనే కాంక్ష పుట్టింది. ఇంట్లో డ్రాయింగ్ రూమ్‌లో దీన్ని ఒక మూల పెడితే, ఇంటికే గొప్ప కళ వచ్చి తీరుతుంది.

"దీని సంగతి చెప్పండి!" అన్నాను నేను.

అతను అలా ఇలా నసిగి ఆఖరికి "వెయ్యి రూపాయలు ఇవ్వండి!" అన్నాడు.

ఉలిక్కి పడ్డాను. "వెయ్యి రూపాయలా?"

"అవున్సార్, మీకు దాని సంగతి తెలీని దేముంది? అది మా ఇంటికి వచ్చే వందేళ్ళు దాటింది, సార్! ఆ జపాన్ వాళ్ళయితే అది అప్పటికే నాలుగైదు వందల ఏళ్ళ కిందటిదని చెప్పారు. అంటే మొత్తం అయిదారు వందల ఏళ్ళున్న మాట దాని వయసు. ఆలోచించండి. ఇలాటి వాటిలో మీ రెంత పాతవి కొంటే అంత విలువ ఎక్కువ వాటికి. అసలు వెయ్యి రూపాయలంటే చాలా తక్కువ దీనికి!"

అతను చెప్పేది నిజమే అయితే దీనికి వెయ్యి రూపాయలు ఇచ్చేసెయ్యచ్చు కానీ, అది నావల్ల కాదు. అంత ఇవ్వలేనని చెప్పాను. మొత్తానికి లాగి పీకి బేరం రెండొందల యాభైకి సెటిల్ చేశాను.

జేబులోంచి నేను డబ్బు తీస్తూంటే అతను జాగ్రత్తగా ఆ బుద్ధ విగ్రహాన్ని పాక్ చేశాడు. పెద్ద నిధి దొరికినంత సంబరంగా ఇంటికి చేరాను.

ఇంట్లో డ్రాయింగ్ రూమ్‌లో అనుకున్నట్లు టేబిల్ మీద పెట్టేసరికి ఎక్కడ లేని అందమూ ఇంటికి వచ్చిందని స్పష్టమయింది.

రెండు రోజుల తరవాత తిలక్ మా ఇంటికి వచ్చాడు. రాగానే నేను కొన్న వస్తువును అపురూపంగా చూపించాను.

తిలక్ దానికేసి పరిశీలనగా చూసి, ఒకసారి దగ్గరినుంచి పరీక్షించి పెట్టేశాడు.

"ఎలా ఉంది?" అని అడిగాను నేను ఆత్రతతో.

"ఎంత ఇచ్చావన్నవ్? రెండొందల యాభై కదా! నీకు మతి పోయినట్లుంది!"

నాకు ఇప్పుడు పోయింది మతి!

"ఏం అలా అంటున్నావ్? అది అయిదార్వందల ఏళ్ళ నాటిది—తెలుసా? నిజానికి దాని విలువ వెయ్యికి పైగానే ఉంటుంది!" అన్నాను.

"ముసలాడు నీకు టోకరా ఇచ్చాడు!" అన్నాడు తిలక్ ఒకే మాటలో.

"అదేమిటి?"

"ఒరే, పిచ్చి సన్నాసీ! చదువుకున్నావు కానీ నీ తెలివి తెల్లారినట్లే ఉంది!"

"ఏం జరిగిం దసలు?"

"ఇలాటివి ఎక్కడా నమ్మకు. అంత విలువ ఉండేది ఎవరూ ఇంత తక్కువకు అమ్మరు. పైగా ఇంకోటి గుర్తుంచుకో—ఇలాటి అసలు విగ్రహాలు, పెయింటింగ్‌లు వంటి వాటికి డూప్లికేట్స్ తయారు చేస్తారు. అది తెలుసు గదా నీకు! ఇలాటివన్నీ సాధారణంగా ఫ్రాడ్స్ అయి ఉంటాయి. అవును, అసలు ఇంకోటి నాకు అర్థం కావటం లేదు. ఆ ముసలాడికి వయసు అరవై ఉంటుందన్నావు. మరి అది వాడి ఇంట్లోనే వంద ఏళ్ళ నుంచి ఉంటూందంటే ఎలా నమ్మావ్? నీకు టోపీ అక్కడ పడింది. పైగా ఇలాటి వాటిని కొంటూంటే వాటి అసలు వయసు నిర్ణయించుకోవటం గురించి నీ కేం తెలుసు?"

"నిజమే!" తిలక్ తిడుతూంటే ఒప్పుకున్నాను.

"పోనీలే, ఇప్పటికీ మించిపోయింది లేదు. తీసుకెళ్ళి ఏ వందకో, యాభైకో అమ్మేసెయ్. నష్టం కొంతైనా పూడుకుంటుంది!" అన్నాడు తిలక్ ఓదార్పుగా.

నాకు బాధ కలిగింది. తిలక్ అంటున్నది నిజమే. కానీ అది నిజం కాకుండా ఉంటే బాగుండు ననిపించింది.

పోనీ, తీసుకెళ్ళి ఆ ముసలాడికి ఇచ్చేస్తే? ఆ ఆలోచన వచ్చాక కొంత తేరుకున్నాను.

మళ్ళీ ఒక నెల్లాళ్ళ తరవాత పట్నానికి బయలు దేరినప్పుడు ఆ బుద్ధ విగ్రహాన్ని జాగ్రత్తగా పాక్‌చేసి పట్టుకున్నాను.

సిటీలో దిగిన వెంటనే ఆ బరువు వదిలించు కోవాలని నిర్ణయించుకున్నాను. బస్‌స్టాండ్‌లో దిగి తిన్నగా ఆ ముసలాడి ఇంటి కేసి నడవడం ఆరంభించాను.

ఎంత దగా! నాకు తెలీనే లేదు.

అందంగా అతను వేసిన టోపీని నేను ఇంటిలో జాగ్రత్తగా అలంకరించుకున్నాను.

చేతిలో ఉన్న విగ్రహం మరింత బరువుగా తోచింది.

రోడ్ దాటుతూంటే ఎదురుగా యాంటిక్స్‌షాపు; ఉన్నట్టుండి నాకు ఏదో ఆలోచన తట్టింది. షాపులోకి నడిచాను. చేతిలోని పాక్‌ను అక్కడ బల్ల మీద పెట్టి బిక్క ముఖం పెట్టాను.

ముసలాడు చెప్పిన కథ ఇంకా గుర్తుంది నాకు. ఆ కథకే మరిన్ని రంగు లద్ది షాపులో దాన్ని బేరానికి పెట్టాను. దాని వయసు వెయ్యేళ్ళకు పెంచాను— చేతిలో ఉండే పనే కదా!

అత డా విగ్రహాన్ని అటూ ఇటూ తిప్పి చూసి లోపలకు తీసుకెళ్ళాడు. నాకు తెలుసు—లోపల దాన్ని ఏదో పరీక్ష చేస్తాడు కాబోలు చేసి—'ఇది ఫ్రాడ్, పోవోయ్!' అంటాడు. అలా అనేసి వూరుకుంటే పరవాలేదు. పోలీసుల్ని పిలిస్తే...

నాలో భయం పెరిగింది.

అయిదారు నిమిషాల తరవాత అతను వచ్చాడు. "మీ రంటున్నట్లు దీనికి వెయ్యేళ్ళు వయసుండదండీ! మహా అయితే ఏడెనిమిది వందలు దాటదు. మీరు వూ అంటే యాభై రూపాయ లిస్తా! అంతకన్నా ఇంకో పైస అయినా నాకు కష్టమే!"

"అదేమిటి? ఏడెనిమిది వందల ఏళ్ళది అంటు న్నావ్—మరి కేవలం యాభైయే ఏమిటి?" అన్నాను నేను.

"ఇప్పుడు ఇలాటి విగ్రహాలకు గిరాకీ బొత్తిగా తగ్గిపోయిందండీ! ఏదో మీరు అవసరం కొద్దీ అమ్ముతానంటున్నారు గనక..."

"అక్కర్లేదు" అంటూ విగ్రహాన్ని అందు కున్నాను. దానికి నే నిచ్చిన విలువ కన్నా ఇప్పుడు నా కెక్కువ సంతృప్తి ఇస్తూంది.

సంతృప్తికి విలువ ఎవరు కట్టగలరో మీరు చెప్పండి. ★